## అమరత్వం సాధ్యమేనా!



**క్వాంటం ఫిజిక్స్‌లో ఉన్న అనిశ్చితి ఆధారంగా అమరత్వం గురించి చెప్పుకొనే సిద్ధాంతాలు సరే. నిజంగానే అది ప్రస్తుత వాస్తవ ప్రపంచంలో సాధ్యమేనా అంటే కొన్ని ఆసక్తికరమైన జవాబులు వినిపిస్తున్నాయి.**

1. శాశ్వతంగా నిత్యయవ్వనంతో ఉండే హైడ్రా అనే జీవి రహస్యాన్ని అనుసరిస్తే అమరత్వం సాధ్యమేనని శాస్త్రవేత్తల ఆశ.

2. నానో టెక్నాలజీ ద్వారా శరీరంలో ప్రతి అవయవాన్నీ ఆరోగ్యంగా ఉంచుతూ వార్ధక్యాన్నీ, ఆయువునీ వీలైనంత పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి.


3. జన్యువుల చివర ఉండే టెలోమీర్ అరిగిపోతున్న కొద్దీ కణవిభజన బలహీనపడుతుంది. మరణానికి ఇదో ముఖ్య కారణం. ఆ అరుగుదలను ఆపేందుకు ప్రయత్నిస్తున్నారు.

4. సమీప భవిష్యత్తులో చావును జయించవచ్చనే ఆశతో కొంతమంది తమ మృత శరీరాలను భద్రపరచమంటూ కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఈ పద్ధతికి క్రైయోనిక్స్ అని పేరు.

## ఇలా ఉంటే సరి!

మతం ప్రకారం ఆత్మ ఉందా! క్వాంటం ఫిజిక్స్ ప్రకారం వేర్వేరు లోకాలు ఉన్నాయా అన్న విషయాన్ని పక్కన పెడితే... మృత్యువు ఉన్నా లేకపోయినా చేతిలో ప్రస్తుతం ఉన్న జీవితాన్ని మాత్రం పరిపూర్ణంగా ఆస్వాదించమని చెబుతున్నారు పెద్దలు. కాలం మనకు అందించే అవకాశాల్లో ఉత్తమమైనదాన్ని ఎంచుకోవడం, సానుకూలమైన భావనలు పెంపొందించుకోవడం, ఈ లోకం మన ఒక్కరిదే కాదు అన్న ఎరుకతో సామాజిక స్పృహతో మెలగడం, జీవితానికి ఓ మంచి లక్ష్యాన్ని ఏర్పర్చుకుని దాన్ని సాధించడం, కరుణతో ఉండటం, మార్పులను స్వాగతిస్తూ వాటికి అణుగుణంగా జీవితాన్ని మలుచుకోవడం... ఇలాంటి లక్షణాలు ఉంటే మనిషి జీవితం పరిపూర్ణంగానూ, తను మరణించాక కూడా ప్రభావం శాశ్వతంగా ఉంటుందని వారి సూచన.





## ఇదే ఆత్మ

జిజాంగ్ షా అనే పరిశోధకుడు క్వాంటం థియరీ ఆఫ్ సౌల్ (Quantum Theory of Soul) అనే పత్రాన్ని వెలువరించాడు. ఇందులో క్వాంటం ఫిజిక్స్ ద్వారా ఆత్మను వివరించే ప్రయత్నం చేశాడు. అవి ధార్మిక భావనలకు దగ్గరగా ఉన్నాయి. ఆత్మ ఓ వ్యక్తి ఉనికికి మూలం; మనిషి చనిపోయినా ఆత్మ కొనసాగుతూనే ఉంటుంది; దేహంలో ఉన్నప్పటికీ ఆత్మకు భౌతికమైన పరిమితులు ఉండవు; దూరంగా ఉన్న ఇతర ఆత్మలతో అది సంభాషించగలదు; విశ్వంతోనూ అనుసంధానం ఏర్పర్చుకోగలదు; అణిమాది సిద్ధులను శాస్త్రీయంగా రుజువు చేయవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే జీవితానికి అర్థం, పరిపూర్ణత ఇచ్చేది ఆత్మే అంటాడు షా తన పత్రంలో!